
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 21 జూన్ 2024



### గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 20: సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ అరుణాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్-1 పోస్టు ఖాళీగా ఉన్నదన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కలిగి 55 శాతం మార్కులుండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ అదనపు అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగినవారు 26 లోగా సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



మెదక్ కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న రఘునందన్

## అల్లర్ల కారణాలను న్యాయస్థానానికి వివరించా..

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- గోసంరక్షకుల తరపున కోర్టులో వాదనలు

మెదక్, జూన్ 20 : మెదక్‌లో చోటుచేసుకున్న అల్లర్లకు కారణం పోలీసులు వైఫల్యమేనని న్యాయవాది, ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు. గురువారం ఆయన మెదక్ కోర్టులో గోసంరక్షకుల తరఫున వాదనలు వినిపించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పోలీసుల వైఫల్యాన్ని కోర్టుకు వివరించామన్నారు. గోసంరక్షకులు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిన వెంటనే స్పందించి ఉంటే అల్లర్లు చోటు చేసుకునేవి కావని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 21కి కేసును వాయిదా వేశారని తెలియజేశారు. న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. అలాగే, తనకు ఓటేసి గెలిపించినవారికి, అభిమానులు, కార్యకర్తలకు అండగా ఉంటానని, అందుకే వారి తరఫున కోర్టులో వాదనలు వినిపించడానికి వచ్చానని తెలిపారు. నిజాంపేట జడ్పీటీసీ విజయ్‌కుమార్, న్యాయవాది సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## వెబ్‌సైట్‌లో ఎస్‌ఏ ఖాళీలు, పదోన్నతి సీనియారిటీ జాబితా

- నేడు ఎస్‌ఏ బదిలీలకు వెబ్‌ఆప్షన్లు



సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 20: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నది. స్కూల్ అసిస్టెంట్, పీఎస్ హెచ్‌ఎం ఖాళీలను డీఈవో సంగారెడ్డి వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. అదేవిధంగా జడ్పీ యాజమాన్య పరిధిలో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం అర్హులైన ఎస్జీటీ సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. జిల్లాలో 872 మంది స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతి పొందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జూన్ 1 నాటికి ఒకే పాఠశాలలో రెండో సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకోవడంతో పాటు ఒకే పాఠశాలలో ఎనిమిది సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం గురువారం కల్పించడంతో 60 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిని అధికారులు పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేశారు. ఇక స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు సంబంధించి వెబ్ ఆప్షన్లు శుక్రవారం ఓపెన్ కానున్నాయని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

## 'డబుల్' ఇళ్ల ఆక్రమణ

- తాళాలు పగులగొట్టి స్వాధీనం చేసుకున్న కొందరు
- ఖాళీ చేయించిన పోలీసులు



డబుల్‌బెడ్రూం ఇళ్ల తాళాలు పగుల గొడుతున్న దృశ్యం

రామాయంపేట, జూన్ 20: మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల తాళాలు పగులగొట్టి ఆక్రమించుకోవడం ఉద్రికతకు దారి తీసింది. ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో పేదల కోసం మొత్తం 295 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. గతేడాది మార్చిలో 250 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. మిగిలిన ఇళ్లు ఇంకా ఎవరికీ కేటాయించ లేదు. దీంతో, గతంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుని ఇళ్లు రానివారు కొందరు గురువారం డబుల్‌బెడ్రూం ఇళ్లను తాళాలు పగులగొట్టి స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోవాలని హెచ్చరించారు. కానీ, ఆక్రమణదారులు మొండికేయడంతో వాగ్వాదం జరిగింది. అధికారికంగా కేటాయించకుండా ఇళ్లు స్వాధీనం చేసుకుంటే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించడంతో వారు వెనక్కుతగ్గారు. ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు.

## దృష్టి మళ్లించి ఏటీఎం తస్కరణ..

### రూ.40 వేలు విత్‌డ్రా

రామచంద్రాపురం, జూన్ 20 : మహిళ దృష్టి మళ్లించి ఏటీఎం కార్డు చోరీచేసి రూ. 40వేలను విత్‌డ్రా చేసుకున్న ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ నర్సింహ గురువారం వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన పటాన్‌చెరుకు చెందన కొల్లూరి నర్సింహారెడ్డి, తరుణంరెడ్డి దంపతులు రామచంద్రారెడ్డినగర్ ఎస్‌బీఐ ఏటీఎం వద్ద డబ్బులు విత్‌డ్రా చేసేందుకు వెళ్లారు. తరుణంరెడ్డి తన ఏటీఎం కార్డు ద్వారా రెండుసార్లు రూ. 20 వేల చొప్పున విత్‌డ్రా చేశారు. అదే సమయంలో ఏటీఎంకు వచ్చిన కోటేశ్వర్‌రావు(23) త్వరగా డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలని ఆమెను తొందరపెడుతూ దృష్టిమళ్లించి, ఆమె కార్డును తన వద్ద ఉంచుకుని నకిలీకార్డును ఆమె చేతికందించాడు. అప్పటికే ఏటీఎం పిన్‌ను గుర్తించాడు. తరువాత తరుణంరెడ్డి కార్డు నుంచి మరో ఏటీఎంలో నిందితుడు రూ.40వేలు విత్‌డ్రా చేశాడు. విషయం గుర్తించిన ఆమె రామచంద్రపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం కూకట్‌పల్లిలో నిందితుడిని పట్టుకున్నారు.

## నులిపేద్దాం..

నులి పురుగుల నివారణ కోసం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం సంగారెడ్డి, మెదక్ కలెక్టర్లు ప్రారంభించారు. సంగారెడ్డిలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కలెక్టర్ క్రాంతి మాత్రలు వేశారు. తూప్రాన్ ఉన్నత పాఠశాలలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాత్రలు అందజేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ చూపగలరని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

-సంగారెడ్డి అర్బన్/తూప్రాన్








ఈడీ దాడులు

# కలకలం..

- ఎమ్మెల్యే గూడెం సోదరులపై కేంద్ర సంస్థ నజర్
- ఇళ్లు, కార్యాలయాలను జల్లెడ పట్టిన అధికారులు
- ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు
- రూ.342 కోట్లు కట్టాలని మైనింగ్ శాఖ నోటీసుల నేపథ్యంలో ఈడీ ఫోకస్
- ఎమ్మెల్యే వర్గీయుల బెంబేలు



ఈడీ సోదాలు చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఇళ్లు

పటాన్‌చెరు, జూన్ 20: పటన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో గురువారం రోజంతా ఈడీ సోదాలు నిర్వహించడం పటాన్‌చెరులో కలకలం రేపింది. పారిశ్రామికవాడ నుంచి మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మహిపాల్‌రెడ్డి రాజకీయంగా తిరుగులేదని రుజువు చేసుకున్నారు. అయితే, ఆయన అక్రమ మైనింగ్ ద్వారా పెద్ద ఎత్తున వెనకేసుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు మొదలుపెట్టారు. జిల్లా కలెక్టర్ రంగంలోకి దిగి లక్డారంలో ఎమ్మెల్యే సోదరుడు నడుపుతున్న సంతోష్ మినరల్స్ సంస్థ అక్రమాలను వెలికి తీసి సంస్థను సీజ్ చేశారు. ఏకకాలంలో మైనింగ్, రెవెన్యూ, పీసీబీ శాఖలు మధుసూదన్‌రెడ్డిపై కేసులు నమోదు చేశాయి. ఈ కేసులో ఆయన జైలుకు వెళ్లడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మహిపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ఆయన పార్టీ మారేలా ఒత్తిడి తెచ్చేందుకు కేసులు నమోదు చేశారని బీఆర్‌ఎస్ ప్రచారం చేసింది. ఈ క్రమంలోనే మహిపాల్‌రెడ్డి స్థానిక ముఖ్య నేతతో సంధి చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. తర్వాత, దర్యాప్తు కేవలం లక్డారం క్రషర్లకే పరిమితం కావడం.. ఆరుట్ల, చిన్నకంజర్లలోని క్రషర్ల జోలికి వెళ్లకపోవడంతో ఎమ్మెల్యే కుటుంబం ఊపిరి పీల్చుకుంది.

### నగదు లావాదేవీలపై ఆరా

జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారుల తనిఖీల దర్వాత మైనింగ్ శాఖకు రూ. 342 కోట్లు సీనరేజీ సొమ్ము ఎగవేశారని తేల్చి, ఈమేరకు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగినట్లు తెలిసింది. ఉదయం 7 గంటలకు పటాన్‌చెరుకు చేరుకున్న ఈడీ అధికారుల బృందం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంటికి వచ్చింది. మరో బృందం శాంతినగర్‌లోని ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఎమ్మెల్యే ఇంట్లోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రదేశాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు పహారాకాశాయి. నివాసాలతో పాటు కార్యాలయాల్లోనూ సోదాలు జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు చేశారు. ఈ సందర్భంగా విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఇటీవల జరిగిన కోట్లాది రూపాయల నగదు లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లు, ఆదాయ మార్గాలపై ఈడీ దృష్టి కేంద్రీకరించింది. అక్రమ క్రషర్ల ద్వారా వచ్చిన సంపాదన ద్వారా కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలను సేకరించారని తెలిసింది. బినామీ ఆస్తుల వివరాలు, ఇటీవల కొనుగోలు చేసిన ఖరీదైన కార్ల వివరాలనూ సేకరించారని తెలిసింది.

### పార్టీ మార్పుపై జోరుగా చర్చ

మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతున్నది. కానీ, ఎమ్మెల్యే మాత్రం పార్టీ మారే ప్రసక్తే లేదని అనుచరుల వద్ద గట్టిగా చెబుతున్నారని తెలిసింది. అయినా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరుతారని వార్తలు వచ్చిన ప్రతీసారి మహిపాల్‌రెడ్డి పేరు ముందుకు రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలు పూర్తవగానే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఈడీ మహిపాల్‌రెడ్డిపై దృష్టిసారించడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచనలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెంచడానికే ఈ ప్రయత్నమని ప్రచారం జరుగుతున్నది.

# మాస్టర్ ప్లాన్ ఊసే లేదే..!

- మూడు దశాబ్దాల క్రితం నాటి ప్రణాళికే నేటికీ
- జిల్లా కేంద్రంగా ఏర్పడంతో విస్తరిస్తున్న పట్టణం
- పెరుగుతున్న జనాభా.. పార్కింగ్ సమస్యతో సతమతం
- రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలలోనూ ఇదే పరిస్థితి


మెదక్, జూన్ 19 : మెదక్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత పట్టణ విస్తీర్ణం వేగంగా పెరుగుతోంది. జిల్లా కలెక్టరేట్‌లో వివిధ కార్యాలయాలు తరలిరావడంతో మెదక్ పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతున్నాయి. జిల్లాలోని తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట పట్టణాలు మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. డివిజన్ కేంద్రాలుగా ఆవిర్భవించాయి. నిత్యం వందలాది మంది పట్టణాలకు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లన్నీ రద్దీగా మారుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకేంద్రంతో పాటు జిల్లాలోని మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు. కానీ, ప్రస్తుతం జిల్లాలోని ఏ ఒక్క మున్సిపాలిటీకీ మాస్టర్‌ప్లాన్ రూపొందించలేదు. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాస్టర్‌ప్లాన్ కోసం ప్రయత్నాలు జరిగినా ముందుకు సాగలేదు. ఎన్నికల స్టంట్ మాదిరిగా ఆబరాబాదరాగా జిల్లా కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని ప్రకటించారు. అనంతరం ఎన్నికల హడావుడిలో అది మరుగున పడిపోయింది.

### జిల్లా కేంద్రమయినా పాత ప్లానే..

మెదక్ జిల్లా కేంద్రంగా ఏర్పాటయిన నాటి నుంచి పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోంది. అయినా, 1992లో రూపొందించిన మాస్టర్‌ప్లానే నేటికీ అమలు అవుతుండడం గమనార్హం. దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించడంలో జరుగుతున్న అలసత్వంతో రోడ్లన్నీ ఇరుకుగా మారాయి. వాణిజ్య కూడలిగా పేరొందిన జేఎన్ రోడ్డు ప్రాంతం, కూరగాయల మార్కెట్, మాంసం, చేపల మార్కెట్, పాత బస్టాండ్ పరిసరాలు నిత్యం పార్కింగ్ సమస్యలు తలెత్తున్నాయి. పాత ప్లాన్ కారణంగా లేఅవుట్లలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునేవారికీ ఇక్కట్లు తప్పడంలేదు. మెదక్ పట్టణానికి ఇప్పటికీ బైపాస్ రోడ్డు లేదు. బాల్‌నగర్-బోదన్ హైవే మెదక్ పట్టణం గుండా వెళ్తున్నది. కొత్తగా నిర్మిస్తున్న హైదరాబాద్-ఎల్కతుర్తి జాతీయ రహదారి కూడా జిల్లాకేంద్రం మీదుగానే కొనసాగుతుండడంతో విపరీతంగా ట్రాఫిక్ పెరిగిపోయింది. బైపాస్ లేకపోవడంతో పెరుగుతున్న రద్దీకీ రోడ్లు సరిపోవడంలేదు. జిల్లా కేంద్రంగా ఏర్పడ్డాక మెదక్ మున్సిపాల్టీలో చుట్టుపక్కల గ్రామాలైన అవుసుల పల్లి, ఔరంగాబాద్ పిల్లికోటాల్‌ను మెదక్‌లో విలీనం చేశారు. మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు.

### జోనల్ వ్యవస్థతో ఇబ్బందులు

జోనల్ వ్యవస్థతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో 32 సంవత్సరాల క్రితం స్థిరీకరించిన జోనల్ వ్యవస్థనే ఇప్పటికీ కొనసాగిస్తుండడంతో పట్టా భూములు సైతం వివాదస్పదంగా మారాయి. నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి రావడంతో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోనే మాస్టర్‌ప్లాన్ నిబంధనలు అమలవుతున్నాయి. రామాయంపేటలో కొత్త ప్రణాళికా రూపకల్పన జరిగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



1992లో రూపొందించిన మెదక్ పట్టణ మాస్టర్‌ప్లాన్

# 7,187 మంది బడిబాట

## మెదక్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక

మెదక్ అర్బన్, జూన్ 20: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం మెదక్ జిల్లాలో సత్ఫలితాలనిచ్చింది. జిల్లాలోని సర్కారు బడుల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. విద్యాశాఖ యంత్రాంగానికి మార్గదర్శనం చూస్తూ.. స్వయంగా పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రయత్నాల ఫలితంగా జిల్లాలో 7,187 మంది విద్యార్థులు కొత్తగా సర్కారు బడుల్లో చేరారు. ఇందులో అత్యధికంగా 3,337 మంది 1వ తరగతిలో ప్రవేశాలు పొందారు.




బడిబాటలో పాల్గొన్న కలెక్టర్, డీఈవో (ఫైల్)

### కలిసొచ్చిన సౌకర్యాలు..

గతేడాది నిర్వహించిన మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమాలు, ఇటీవల చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే విశ్వాసం ప్రజల్లో కల్పించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సర్కారు పాఠశాలల వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

# 840 సిలిండర్లు.. 9 వాహనాలు..

- స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్.. నలుగురు నిందితుల అరెస్ట్
- గృహ వినియోగ గ్యాస్ కమర్షియల్ సిలిండర్లలోకి రీఫిల్లింగ్





టాస్క్‌ఫోర్స్ స్వాధీనం చేసుకున్న సిలిండర్లు, వాహనాలు, అరెస్ట్ చేసిన నిందితులు

సంగారెడ్డి క్రైం, జూన్ 20 : అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉన్న రోహన్ ట్రేడర్స్ గోదాంపై ఉదయం 11 గంటల ప్రాంతంలో దాడులు నిర్వహించారు. దాని యజమాని బొక్క శ్రీనివాస్ (46) గృహావసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్‌ను అక్రమంగా కొనుగోలు చేసి కమర్షియల్ గ్యాస్ సిలిండర్లలో రీఫిల్లింగ్ చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. అతడి నుంచి 73 నిండు గ్యాస్ సిలిండర్లు, 661 ఖాళీ సిలిండర్లను, సిలిండర్లు రవాణా చేస్తున్న 9 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఇస్నాపూర్‌లోని సాయికాలనీకి చెందిన మాదిరి రవీందర్ (65) దుకాణంలో గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పట్టుకొని, మూడు తూకం మిషన్లు, మూడు గ్యాస్ రీఫిల్లింగ్ మిషన్‌లు, 53 ఫుల్ గ్యాస్ సిలిండర్లు, 53 ఖాళీ సిలిండర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో నిందితులైన బొక్క శ్రీనివాస్, రవీందర్‌తో పాటు ఇద్దరు డ్రైవర్లు రాజు, ప్రవీణ్‌లను అదుపులోకి తీసుకొని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

# ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

సంగారెడ్డి రూరల్, జూన్ 20 : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో గురువారం ఎఫ్ఎస్ఎస్ఏఐ, మొబైల్ ప్రయోగశాల, ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటం, ఈగలు వాలడం, మైదా పిండిలో లక్క పురుగులు, కూరగాయలు నిల్వ చేసే ప్రదేశంలో సాలెపురుగులు ఉండడాన్ని గ్రహించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేంద్ర మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు తనిఖీలు చేశామన్నారు. కల్తీ జరిగినట్టు అనుమానం కలిగిన పదార్థాలను సేకరించి ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. నాసిరకమైన, గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## 24 నుంచి సంక్షేమాధికారుల పరీక్షలు

● ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో నిర్వహణ
● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 20 : గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమశాఖ పరిధిలోని వసతి గృహాల్లో సంక్షేమాధికారుల పోస్టుల కోసం నిర్వహించనున్న గ్రేడ్-2 పరీక్షలు 24 నుంచి 29వ తేదీ వరకు నర్సాపూర్ బీవీఆర్‌ఐటీలో జరుగనున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మొదటి సేషన్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ ఉంటుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు 3700 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

## కారు ఢీకొని యువకుడి మృతి

ములుగు, జూన్ 20: కారు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా ములుగులో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ములుగు గ్రామానికి చెందిన ఎర్రోళ్ల జశ్వంత్(17) ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం ఇంటి నుంచి కాలేజీకి బయలుదేరాడు. సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో ములుగు రోడ్డుపై కారు ఢీకొట్టింది. స్థానికులు వెంటనే యువకుడిని గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్‌కి తరలించాలని సూచించారు. కుటుంబసభ్యులు లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వైద్యం చేస్తున్న క్రమంలో పరిస్థితి విషమించడంతో జశ్వంత్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



యోగాసనం వేస్తున్న గురుకుల విద్యార్థులు

# ఆరోగ్య యోగం

● మానసిక ఒత్తిడి, రుగ్మతులు దూరం
● యోగాభ్యసనపై పెరుగుతున్న ఆసక్తి
● నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్/చేర్యాల, జూన్ 20: యోగా సర్వరోగ నివారిణిగా నిలుస్తుంది. యోగాభ్యాసం మానసిక, శారీరక సమస్యలే కాకుండా అనేక రుగ్మతలను దూరం చేస్తుందని యోగా నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన యోగా ప్రస్తుతం పట్టణాలు, పల్లెల్లోనూ ప్రాచుర్యం పొందింది. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం

### ప్రాచీన నేపథ్యం

యోగా ప్రాచీన కాలం నాటి విద్యగా ప్రాచుర్యం పొందింది. యోగశాస్త్రం భారత భాగవతాల రచనకు మూలాధారమని, దాని ఆధారంగా చేసుకొని పురాణాలలోని పాత్రలు నిర్మించబడ్డాయని పౌరాణికుల అభిప్రాయం. యోగశాస్త్ర విశిష్టతను తెలియజేస్తూ, రామాయణంలో రాముడికి, వశిష్ఠునికి మధ్య జరిగిన సంవాదం యోగవాసిష్ఠంగా ప్రసిద్ధికి ఎక్కింది. వేద సారాలైన ఉపనిషత్తులు సైతం యోగప్రాముఖ్యతను వెల్లడించాయి. ప్రత్యేకంగా యోగతత్వోపనిషత్ మానవ జీవనంలో యోగాభ్యసనం కీలకమైన పాత్ర పోషిస్తుందని, సంసారిక జీవనంతో పాటూ ఆధ్యాత్మిక జీవనానికి అవసరమైన మానసిక బలాన్ని అందజేస్తుందని తెలుపుతోంది.

### రోగ నివారిణిగా..

శారీరక, మానసిక ప్రశాంతత, మనోబలంతో పాటు సంగ్రహణశక్తిని పెంచే విజ్ఞాన ప్రక్రియ యోగా. ఆసనాల పేరిట అవసరమైనంత శ్రమను కలిగించి శరీరంలోని హార్మోన్‌లు నియమిత పరిమాణంలో నిర్ణీత సమయాల్లో విడుదల కావడానికి దోహదపడుతుంది. అలోపతి వైద్యులు సైతం ప్రస్తుత ఒత్తిడి జీవనంలో యోగా ప్రాధాన్యాన్ని గుర్తించి ఆ దిశగా వివిధ వ్యాధిగ్రస్తులను యోగా వైపు ప్రోత్సహిస్తున్నారు. మధుమేహం, అధిక రక్త పోటు, కొలెస్టరాల్, హృద్రోగాలు, వెన్నునొప్పి వంటి వాటిని నివారించే ఔషధంగా నిలుస్తుంది. జీర్ణ సంబంధిత వ్యాధులను నిర్మూలించి, ఎసిడిటీ నుంచి ఉపశమనాన్నిస్తుంది. మెడ, మోకాళ్లు, కండరాల నొప్పులు తదితర దీర్ఘకాలిక వ్యాధులు పలు ఆసనాలతో దూరమవుతున్నాయి. హైపర్ థైరాయిడిజాన్ని నిర్మూలించేందుకు ఉపయోగపడుతుంది. ఆసనాలతో పాటు ప్రాణయామం ద్వారా సాఫీగా ఊపిరితిత్తుల ప్రక్రియ, శ్వాసక్రియ రేటు పెరుగుదలకు దోహదం చేస్తుంది. అందుకే ఇటీవలి కాలంలో చాలా మంది యోగా వైపు ఆసక్తి చూపుతున్నారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలగడంతో పాటు మనోవికాసం పెంపొందుతుంది. నేచురల్ లైఫ్‌స్టైల్ ఎక్స్‌పర్ట్‌గా, ఆహార ఔషధంగా పనిచేస్తుంది. యోగా ఆరోగ్య అంశాలు నలుగురికి పంచాలన్న సంకల్పంతో ఇటీవల ఉచిత యోగా శిక్షణ శిబిరాల నిర్వహించాం. నిరంతరంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ ఒక్కరూ దైనందిన జీవితంలో యోగా అలవర్చుకుని ఆరోగ్యం పొందాలి.

- నర్సింగరావు, యోగా గురు, చేర్యాల

### దీర్ఘకాలిక వ్యాధులకు చెక్



యోగాసనాలతో దీర్ఘకాలిక వ్యాధులు పక్షవాతం, కిడ్నీ, షుగర్, బీపీ లాంటి వాటికి చెక్ పెట్టవచ్చు. అలోపతిక్ మందులతో తగ్గని వ్యాధులు యోగాతో పూర్తిగా కోలుకున్నవారు ఎందరో ఉన్నారు. నిత్యం ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు ప్రత్యక్ష తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతీ సంవత్సరం మాదిగానే యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. యోగా భవనం పనులు పూర్తి కావపోవడంతో జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నాం.

- నవాజ్‌రెడ్డి,
పతంజలి యోగా సమితి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

### యోగాతో ఆరోగ్యం పదిలం

నిత్యం వివిధ పనులపై ఒత్తిడితో ఉండేవారికి యోగాభ్యసన ఉపశమనం కలిగిస్తుంది. ఎంత ఒత్తిడితో ఉన్నప్పటికీ అర గంట యోగా చేసినా ముఖంలో ప్రశాంతతతో కూడుకున్న కళ పెరుగుతుంది. ఎలాంటి ఛాలెంజ్‌నైనా తేలిగ్గా స్వీకరించగలరు. మంచి ఆర్యోగమే కాదు.. ఉన్నత విలువతో కూడిన సమాజ నిర్మాణం కూడా యోగాతో సాధ్యపడుతుంది.

- దేవేందర్‌రెడ్డి, యోగా శిక్షకుడు, మెదక్





సంగారెడ్డిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

### ఉచిత యోగా తరగతులు

యోగాతోనే పరిపూర్ణమైన ఆరోగ్యం, దీర్ఘాయుష్షు లభించి జీవితం నిశ్చితంగా సాగిపోతుందని యోగా గురువు ఆకుల రవి ప్రచారం చేస్తున్నారు. మెదక్ పట్టణానికి చెందిన ఆకుల రవి కాంట్రాక్ట్ ఉపాధ్యాయునిగా పని చేస్తూ 1990 పతంజలి యోగా కేంద్రం కేంద్రం ద్వారా ఉచితంగా అనేక మందికి యోగా శిక్షణను అందించారు. ఇప్పటి వరకు 10 వేల మందికి శిక్షణ ఇచ్చారు. యోగాతో ఒత్తిడి దూరమవుతుందని, జ్ఞాపక శక్తి ఇనుమడిస్తుందని ఆయన బోధిస్తున్నారు. 2014 నుంచి వశిష్ఠ యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిత్యం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా తరగతులను నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తింపుగా పలు అవార్డుల అందుకున్నారు.



# శాస్త్రీయ సంగీత వెలుగు.. శ్వేతాశర్మ

● శారద సంగీత విద్యాలయం ద్వారా విద్యార్థులకు శిక్షణ
● ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రదర్శనలతో ఆదరణ
● నేడు ప్రపంచ సంగీత దినోత్సవం

సంగారెడ్డి రూరల్, జూన్ 20 : కళా ప్రదర్శనలతో శాస్త్రీయ సంగీతానికి వన్నె తెస్తున్నారు శ్వేతాశర్మ. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన రామ్‌భట్ శర్మ పలువురికి శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మరణానంతరం ఆ బాధ్యతలను మనవరాలు శ్వేతాశర్మ తన భుజస్కందాలపై వేసుకున్నారు. సంగారెడ్డి పట్టణంలోని మంజీరానగర్‌లో 2017లో శారద సంగీత విద్యాలయాన్ని నెలకొల్పి శాస్త్రీయ సంగీతాన్ని బోధిస్తున్నారు. ఐదుగురు విద్యార్థులతో ప్రారంభించి ప్రస్తుతం 96 మందికి పైగా శిక్షణనందిస్తున్నారు. శ్వేతాశర్మ ఓ పక్క శాస్త్రీయ సంగీతంలో శిక్షణ అందిస్తూనే తన విద్యార్థులతో కలిసి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రదర్శనలిస్తున్నారు. వీటితో పాటు టీవీ, రేడియో కార్యక్రమాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చి పలువురి ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. శ్వేతాశర్మతో పాటు వారి ఇద్దరు కూతుళ్లు ఆశ్రిత, అక్షయ కూడా శాస్త్రీయ సంగీతంలో ప్రావీణ్యం పొంది తల్లిబాటలో నడుస్తున్న తనయలుగా పేరు తెచ్చుకుంటున్నారు.



విద్యార్థులతో కలిసి ప్రదర్శన ఇస్తున్న శ్వేతాశర్మ

### శాస్త్రీయ సంగీతంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తారు



ప్రస్తుతం యువత పాశ్చత్య సంగీతానికి అలవాటు పడి శాస్త్రీయ సంగీతాన్ని మర్చిపోతున్నారు. మా తాతయ్య కాలంలో శాస్త్రీయ సంగీతానికి మక్కువ ఎక్కువగా ఉండేది. శాస్త్రీయ సంగీతానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాను. నా భర్త శ్రీనివాస్ ప్రోత్సాహంతో పలు కార్యక్రమాల్లో పాల్గొని కచేరీ ఇస్తున్నాను. కచేరీలకు వచ్చిన వారు శాస్త్రీయ సంగీతంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు.

- శ్వేతాశర్మ, శిక్షకురాలు, సంగారెడ్డి

# నాగులపల్లి ఔటర్ వద్ద ఆర్వోబీని పూర్తి చేయాలి

**దక్షణ మధ్య రైల్వే జీఎంకు మెదక్ ఎంపీ రఘునందన్ వినతి**



వినితిపత్రం సమర్పిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ నేతలు

పటాన్‌చెరు, జూన్ 20: రామచంద్రాపురం మండలం ఈదులనాగులపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు విస్తరణకు వీలుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను తక్షణం పూర్తిచేయాలని మెదక్ ఎంపీ రఘునంధన్‌రావు దక్షణ మధ్య రైల్వే జీఎంకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో ఔటర్ వద్ద సర్వీస్ రోడ్డు ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. లింగంపల్లి శంకర్‌పల్లి మధ్య ఉన్న రైల్వే లైను ఔటర్ రింగ్ రోడ్డు కింది నుంచి ఉండటంతో సర్వీస్ రోడ్ల నిర్మాణం జరగలేదని వివరించారు. ఆర్వోబీ పనులు ప్రారంభం పూర్తి స్థాయిలో కొనసాగడకపోవడంతో కొల్లూరు జంక్షన్, ఈదులనాగులపల్లి గ్రామాల వద్ద పెద్దఎత్తున ట్రాఫిక్ జాం జరుగుతోందని వివరించారు. ట్రాఫిక్ సమస్యకు ఇబ్బందులు లేకుండా ఉండేలా ఆర్వోబీ పనులను తక్షణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ రఘునంధన్‌రావు విజ్ఞప్తులపై జీఎం సానుకూలంగా స్పందించారు. తక్షణం ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఆర్వోబీల పురోగతిని సమీక్షిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ వెంట బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, నాయకులు సందెళ్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## ధర్మరక్షణకు తోడ్పాటునందించాలి

● విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయ

తొగుట, జూన్ 20 : ధర్మరక్షణకు ప్రతీ ఒక్కరూ తోడ్పాటునందించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయ పిలుపునిచ్చారు. గురువారం తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్కృతి దీక్ష యజ్ఞానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 27 కుటుంబాల నుంచి క్రైస్తవ మతంలోకి మారిన 105 మందిని తిరిగి హిందూ ధర్మాన్ని స్వీకరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మంలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్‌లు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ మ్యూజియంను సందర్శించిన కలెక్టర్ కుటుంబసభ్యులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 20 : సంగారెడ్డిలోని సర్ సీవీ రామన్ సైన్స్ మ్యూజియంను గురువారం కలెక్టర్ వల్లూరు క్రాంతి కుటుంబసభ్యులు సందర్శించారు. మ్యూజియం ఆవరణలోని బొటానికల్ గార్డెన్‌లోని మొక్కలను పరిశీలించి బాగుందంటూ కితాబిచ్చారు. వారి వెంట జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ కార్యాలయ భవనం ప్రారంభం

**ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య రగడ**



భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీ

గుమ్మడిదల, జూన్ 20 : గుమ్మడిదలలో నూతన ఎంపీపీ కార్యాలయ భవనాన్ని ఎంపీపీ సద్ది ప్రవీణ భాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్‌తో కలిసి జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీరెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు నక్క మంజుల, ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య ఘర్షణ చోటుసుకున్నది. శిలాఫలకంపై ప్రొటోకాల్ ప్రకారం పేర్లు లేవని కాంగ్రెస్ ఎంపీటీసీలు వాగ్వావాదానికి దిగారు. ఇరు పార్టీ వర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.

## చెస్ బాక్సింగ్‌పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఎంపీ సన్మానం

నారాయణఖేడ్, జూన్ 20 : అంతర్ జాతీయ చెస్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన అన్నాచెల్లెళ్లను గురువారం జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్ నారాయణఖేడ్‌లోని తన స్వగృహంలో సన్మానించారు. కేరళలోని త్రివేండ్రమ్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ ఛాంపియన్‌షిప్‌పోటీల్లో సీనియర్ మహిళా విభాగంలో కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం దక్కడ్‌పల్లికి చెందిన ప్రతిభ మూడు బంగారు పతకాలు సాధించగా, ఆమె సోదరుడు విజయ్‌రాఘవేందర్‌రావు పురుషుల విభాగంలో వెండి పతకం సాధించారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్



జహీరాబాద్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థునులకు నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వేస్తున్న ఎమ్మెల్యే సునితారెడ్డి



జిన్నారం: బొల్లారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, వైద్య సిబ్బంది

# ఆల్బెండజోల్ మాత్రలు అందరూ వేసుకోవాలి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

కంది, జూన్ 20: నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ప్రతి ఒక్కరూ వేసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం కందిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆయన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీపీ కాల్వ సరళ పాల్గొన్నారు.

●**నారాయణఖేడ్:** విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ చక్కగా చదువుకొని, ఉన్నతస్థాయికి ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు యాదవరెడ్డి, మన్మథకిషోర్, వైద్యాధికారి రాజేశ్వర్, ఆత్మకూరిరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని టీఎస్‌టీ తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ గూరబాయి భర్త శంకర్ ఇటీవల మృతిచెందాడు. పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

●**జహీరాబాద్:** అందరం సంఘటితమై నులిపురుగులను నివారించేలా కృషి చేద్దామని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొ న్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

●**మునిపల్లి:** పిల్లల ఎదుగుదలకు నులి పురుగులు (డీవార్మింగ్ టాబ్లెట్లు) అవసరమని మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మనుజారెడ్డి అన్నారు. మునిపల్లితోపాటు ఆయా గ్రామాల్లో పిల్లలకు డీవార్మింగ్ టాబ్లెట్లు వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మొగులయ్య, పీహెచ్ఎన్ చంద్రభాను, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంత్ పాల్గొన్నారు.

●**జిన్నారం:** బొల్లారం మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగనిర్మల, డాక్టర్ రాధిక, వైద్య సిబ్బంది పంపిణీ చేశారు.

●**కల్హేర్:** కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోప్షన్ సభ్యుడు ఎండీ.ఆలీ, ఎంపీటీసీ సంగప్ప, క్రిష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ జేబా తదితరులు పాల్గొన్నారు.

**మెదక్ జిల్లాలో..**

వెల్దుర్తి, జూన్ 20: ప్రతి విద్యార్థి నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయించుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ రమేష్ గౌడ్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే వెల్దుర్తికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ముల్క శ్రీనివాస్ కాలేయం వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నివాసానికి వెళ్లి పరామర్శించారు.

●**నర్సాపూర్:** నర్సాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయనిర్మల, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శేఖర్, భిక్షపతి పాల్గొన్నారు.

●**చిన్నశంకరంపేట:** చిన్నశంకరంపేట మండలవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు ఆధ్వర్యంలో ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. జంగరాయి పాఠశాలలో ఎంపీపీ భాగ్యలక్ష్మి పిల్లలకు మాత్రలు వేశారు.



చిన్నశంకరంపేట మండలం జంగరాయి పాఠశాలలో పిల్లలకు నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

●**పెద్దశంకరంపేట:** చిన్నారుల్లో పౌష్టికాహార లోపం రక్తహీనతకు కారణమయ్యే నులి పురుగులను నివారించే మాత్రలను గురువారం విద్యార్థులకు పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంఈవో వేదశ్రీలు పంపిణీ చేశారు.

●**కొల్చారం:** కొల్చారం మండల పరిధిలోని ఎనగండ్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ మంజుల, కొల్చారం మెడికల్ ఆఫీసర్ రమేష్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రంగంపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్షిత, కొల్చారం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

●**చిలప్‌చెడ్:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో శరత్‌కుమార్, డాక్టర్ ప్రతిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాల, బాలికల పాఠశాలలో ఎంఈవో వికాస్ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు.

## కార్మికుడి అదృశ్యం



రాజు సైకియా (ఫైల్)

మనోహరాబాద్, జూన్ 20: పరిశ్రమలో పనిచేసే కార్మికుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన రాజు సైకియా(36), భార్య రింకు సైకియా పదేళ్ల క్రితం మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి గ్రామానికి వలసొచ్చి అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. రాజు సైకియా మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామ శివారులో ఉన్న మోడల్ సేఫ్టీ గ్లాస్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం పరిశ్రమకు వెళ్లిన రాజు తిరిగిరాలేదు. ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. భార్య రింకు ఇంటిపక్కనే ఉన్న తోటి కార్మికుడిని అడగ్గా.. ఆ రోజు పరిశ్రమలోకి రాలేదని తెలిపాడు. అప్పటి నుంచి వెతికినా రాజు ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## నిబంధనల ప్రకారం రైతులకు నష్ట పరిహారం: ఆర్డీవో



న్యాయం జరిగేలా చూడాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేస్తున్న రైతులు

నర్సాపూర్, జూన్ 20: ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలువ కోసం భూములు కోల్పోయే రైతులకు నష్టం వాటిల్లకుండా పరిహారం అందేలా చూస్తామని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్‌లోని రైతువేదికలో సంగారెడ్డి కెనాల్ కోసం భూములు కోల్పోనున్న మండలంలోని పెద్దచింతకుంట, రెడ్డిపల్లి గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న భూముల ధరలకు అనుగుణంగా పరిహారం ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. రైతులు ఏమైనా అభ్యంతరాలు, సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా తమ దృష్టికి తీసుకొస్తే, వాటిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక భూములు కచ్చితంగా ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ విషయమై పలువురు రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం భూముల ధరలు ఎకరాకు రూ.50 లక్షలకు పైగా పలుకుతుందని, అటువంటి విలువైన భూములకు పరిహారం ఇచ్చే విషయంలో నష్టం కలుగకుండా న్యాయం జరిగేలా చూడాలని ఆర్డీవోతో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, నీటి పారుదల శాఖ సంగారెడ్డి డీఈఈ కవిత, ఆర్డీవో కార్యాలయ ఏవో సదానందం తదితరులు పాల్గొన్నారు.

## నేడు తెల్లాపూర్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ

రామచంద్రాపురం, జూన్ 20: తెల్లాపూర్‌లో రూ.8.5 కోట్లతో నిర్మించిన నూతన మున్సిపల్ భవనాన్ని శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించనున్నారని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఇందిరానగర్ సర్కిల్ వద్ద ఉన్న ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆడిటోరియం పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

## తెల్లాపూర్‌లో వెలసిన కాంగ్రెస్ ఫ్లెక్సీలు



ఇందిరానగర్ వద్ద వెలిసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫ్లెక్సీలు

రామచంద్రాపురం, జూన్ 20: దశాబ్దకాలంగా తెల్లాపూర్‌లో కాంగ్రెస్ ఫ్లెక్సీల ఏర్పాటు అరుదుగా కనిపిస్తూ వచ్చాయి. అధికార, అనధికార కార్యక్రమాలకు తెల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటు చేసేవారు. ఇతర పార్టీలకు అవకాశం ఇచ్చేవారు కాదు. ఇతర పార్టీకి చెందినవారు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటే అనుమతులు లేవంటూ మున్సిపల్ అధికారులు తొలగించేవారు. ప్రస్తుతం మున్సిపల్ భవన ప్రారంభోత్సవానికి మంత్రి దామోదర రాజనర్సింహ వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. సభా ప్రాంగణం వద్ద కాంగ్రెస్ శ్రేణుల ఫ్లెక్సీల ఏర్పాటు స్థానికంగా చర్చంశనీయంగా మారింది.

## 'నీట్' అవకతవకలపై విచారణ జరపాలి

సంగారెడ్డి రూరల్, జూన్ 20: నీట్ ప్రవేశ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంగారెడ్డిలో సీపీఎం నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపి మాట్లాడారు. నీట్ పరీక్షల వ్యవహారంలో ప్రధాని మోదీ స్పందించాలని, నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేశం, మాణిక్యం, సాయిలు, యాదగిరి, అశోక్ పాల్గొన్నారు.

## జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ

సంగారెడ్డి రూరల్, జూన్ 20: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరునెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో 24 గంటలు పని చేస్తూ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న కలెక్టరేట్ ముందు ధర్నా చేయనున్నామని, ధర్నాలో జీపీ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జీపీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, దశరథ్, నాయకులు పాల్గొన్నారు.

## సమాచారం

**గ్రూప్-2 పరీక్షకు ఉచిత గ్రాండ్ టెస్ట్**

సంగారెడ్డి అర్బన్, జూన్ 20: సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో టీజీపీఎస్సీ గ్రూప్-2 దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చేనెల 8 నుంచి ఆఫ్‌లైన్‌లో ఉచిత గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8, 9, 15, 16, 22, 23, 30, 31వ తేదీల్లో గ్రాండ్ టెస్టులు ఉంటాయని పేర్కొన్నారు. పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 1.30 నుంచి 4 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల ఆసక్తి కలిగిన అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో జూలై 5 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08455-277015, 9949592991 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

**'అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి'**

నారాయణఖేడ్: అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు ప్రభుత్వం పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి కోరారు. గురువారం ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడారు.

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు: ఏడీఏ**

వెల్దుర్తి: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి హెచ్చరించారు. గురువారం వెల్దుర్తిలోని విత్తన, ఎరువుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. దుకాణాల్లో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, ఎమ్మార్పీ ధరకే విత్తనాలు, ఎరువులను విక్రయించాలన్నారు.

**'నర్సింహులు కుటుంబాన్ని ఆదుకోవాలి'**

జహీరాబాద్, జూన్ 20: కోహీర్ మండలంలోని బడంపేట గ్రామానికి చెందిన బేగరి నర్సింహులును హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సమతాసైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు బాబానగర్‌కు చెందిన రవికుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నర్సింహులు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఆర్డీవో రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు, సమతాసైనిక్‌దళ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కొత్త చట్టాలపై అవగాహనతోనే సత్వర న్యాయం

- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూన్ 20: కొత్త చట్టాలపై అవగాహన రావాలంటే నేర్చుకోవాలనే తపన మనలో వున్నప్పుడే సాధ్యమవుతుందని, కొత్త చట్టాలపై సరైన అవగాహన ఉంటేనే బాధితులకు సకాలంలో సత్వర న్యాయం జరుగుతుందని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి అమలుకానున్న నూతన చట్టాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులకు గురువారం ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొత్త చట్టాల అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. అప్పుడే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, అరెస్ట్, వాంగ్మూలం నమోదులో పాటించాల్సిన జాగ్రత్తలు, చార్జ్‌షీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించాల్సిన తీరు, తదితర అంశాలపై, కొత్త చట్టంలో మార్పు గురించి వివరించారు. అనంతరం అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరినీ రుణ విముక్తుల్ని చేయాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, జూన్ 20: ఆంక్షలు లేకుండా రైతులందరినీ రుణ విముక్తి చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి, తాజాగా ఆంక్షలు విధించాలని చూడటం సిగ్గుచేటని విమర్శించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిసెంబరు 9న రూ.2 లక్షల రుణమాఫీపైనే తొలి సంతకం చేస్తానని రైతులను మభ్యపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరునెలలు గడిచినా అమలు చేయడం లేదన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గోవర్ధన్‌నాయక్, నాయకులు వెంకటేశ్వర్లు, జలేందర్‌రావు, జీవీ శ్రీనివాస్, నర్సింగ్‌రావు, మజీద్, కసిని శ్రీకాంత్ పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య



ముస్లాపూర్‌లో మిషన్ భగీరథ వివరాలు తెలుసుకుంటున్న డీపీవో యాదయ్య

అల్లాదుర్గం/చిన్నశంకరంపేట, జూన్ 20: మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై చేస్తున్న సర్వేను త్వరగా పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అధికారులను ఆదేశించారు. గురువారం అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి, ముస్లాపూర్, అల్లాదుర్గం తదితర గ్రామాల్లో పర్యటించి మిషన్ భగీరథ సర్వేపై విచారించారు. ఈ సందర్భంగా పలు గృహాలకు సరఫరా అవుతున్న భగీరథ నీటిపై యజమానులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్ యాదవ్, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, శ్రీనివాస్, వెంకటరత్నం ఉన్నారు. చిన్నశంకరంపేట మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు అందించడమే లక్ష్యంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని ఎంపీవో కలిమొల్ల అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఇంటింటి సర్వే నిర్వహించి పేర్లను నమోదు చేశారు.

## ప్రతిభావంతుడు కలెక్టర్ రాహుల్‌రాజ్

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్



కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్ అర్బన్, జూన్ 20: కలెక్టర్ రాహుల్‌రాజ్ గొప్ప ప్రతిభావంతుడని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ ప్రశంసించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను టీఎన్జీవో జిల్లా బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. కలెక్టర్ స్వయంగా రచించిన గేయాన్ని ఆలపింపజేసుకున్న విద్యార్థులందరూ రెట్టింపు ఉత్సాహంతో బడిబాట వైపు పయనించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి చంద్రశేఖర్, సహ అధ్యక్షులు ఇక్బాల్, మనోహర్, ఫజులొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## సీజీఆర్ ట్రస్టు సేవలు అభినందనీయం

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

గుమ్మడిదల, జూన్ 20: గుమ్మడిదల మండల ప్రజల కోసం సొంత నిధులు కేటాయిస్తున్న సీజీఆర్ ట్రస్టు సేవలు అభినందనీయమని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం గుమ్మడిదల మండల కేంద్రంలో సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని, రూ.1.60 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, తహసీల్దార్ గంగాభవాని, పంచాయతీ ప్రత్యేకాధికారి అఖిలేష్‌రెడ్డి, తాజా, మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మనోహరాబాద్, జూన్ 20: పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మనోహరాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణి రికార్డులను పరిశీలించి, గతంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిశీలించారు. పెండింగ్ సమస్యలపై తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్వేయర్ స్వరూప్, కొండల్‌రెడ్డి ఉన్నారు.

## కేతకీలో అదనపు ఎస్పీ పూజలు

ఝరాసంగం, జూన్ 20: దక్షిణకాశీగా పేరొందిన కేతకీ సంగమేశ్వరాలయంలో గురువారం అదనపు ఎస్పీ సంజీవరావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారికి అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## వేతనాల కోసం ఎమ్మెల్యే గేటుకు వినతి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ గేటుకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నర్సాపూర్, జూన్ 20: పంచాయతీ కార్మికులకు 9 నెలలుగా వేతనాలు లేక.. కుటుంబపోషణ దారుణంగా తయారైందని, వెంటనే వేతనాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ గేటుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో.. కార్మికుల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు మంజూరుచేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు బందేలి, సలీం, నర్సింహులు, మల్లేశం, పోచయ్య, లింగం, పెంటయ్య, కృష్ణ పాల్గొన్నారు.

## 'అస్తవ్యస్త విద్యుత్ సరఫరాపై చర్యలు తీసుకోండి'

అల్లాదుర్గం, జూన్ 20: వారం, పదిరోజులుగా విద్యుత్ అస్తవ్యస్తంగా సరఫరా అవుతుండడంపై వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అల్లాదుర్గం మండలం సీతానగర్ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆయా గ్రామాలకు సరఫరా అవుతున్న విద్యుత్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని అయోమయం నెలకొన్నదన్నారు. ట్రాన్స్‌కో అధికారులకు చెబితే పైనుంచే సమస్య ఉన్నదని దాటవేస్తున్నారని రైతులు ఆరోపించారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నిధులు లేక కుంటుపడిన అభివృద్ధి

నారాయణఖేడ్, జూన్ 20: గ్రామపంచాయతీలకు ఏడాదిగా సరైన నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతున్నదని జడ్పీటీసీ లక్ష్మీబాయి, ఎస్సీ సెల్ విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యుడు రవీందర్‌నాయక్ అన్నారు. ఈ విషయమై జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ట్రాక్టర్ల ఫైనాన్స్, పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు ముస్తాఫా, బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు తుర్కపల్లి అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోవారం కొనసాగిన నల్లపోచమ్మ జాతర

మనూరు, జూన్ 20: తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన బోరంచ నల్లపోచమ్మ జాతర ఆరోరోజు కూడా కొనసాగింది. భక్తులు పెద్దఎత్తున రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జయశ్రీరెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వారికి స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ఉండేందుకు సరైన వసతులు లేకపోవడంతో చెట్ల కింద వంటలు చేసుకున్నారు.

# విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట

- పార్టీలకతీతంగా అభివృద్ధి కోసం కృషి చేయాలి
- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి





కంది: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాల్వ సరళ

పెద్దశంకరంపేట, జూన్ 20: విద్య, వైద్యరంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్నదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్నివిధాల మౌలిక వసతులు కల్పించిందన్నారు. పార్టీలకతీతంగా అందరం కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. చివరిస్థాయిలో ఉన్న అభివృద్ధి పనులను గుర్తించి వెంటనే పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా ఐదేళ్ల కాలంలో చివరి మండల సమావేశం కావడంతో ఎంపీటీసీలను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, తహసీల్దార్ గ్రేస్‌బాయి, పేట మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

మనూరు, జూన్ 20: గ్రామాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఎంపీపీ అధ్యక్షురాలు కొంగరి జయశ్రీ మెహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే స్పందించి ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుందని, అందువల్ల అధికారులు సమస్యలపై దృష్టిపెట్టాలని సూచించారు. అతిమ్యాల్ గ్రామంలో మంచినీటి సరఫరా కావడం లేదని గ్రామస్థులు పేర్కొనడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో ఎమ్మెల్యే వారిని సన్మానించారు.

**అభివృద్ధి ధ్యేయంగా పనిచేశాం: ఎంపీపీ**

కంది, జూన్ 20: ఎంపీపీ బాధ్యతలు చేపట్టిన ఐదేళ్ల నుంచి అభివృద్ధే ధ్యేయంగా పనిచేశామని ఎంపీపీ కాల్వ సరళ అన్నారు. కంది ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు అనుకున్న విధంగా చేసేందుకు సహకరించిన అధికారులకు, ఎంపీటీసీలకు, సర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జడ్పీటీసీ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ నుంచి తగినన్ని నిధులు మంజూరు చేయించి మండలాన్ని తీర్చిదిద్దామన్నారు. అన్ని గ్రామాల్లో బోర్లు, అండర్ డ్రైనేజీలు, సీసీరోడ్లు వేసేందుకు సహకరించామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. సమావేశం ముగిసిన అనంతరం ఎంపీటీసీలకు, తాజా, మాజీ సర్పంచులకు ఎమ్మెల్యే శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేట సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి